క్లుప్తంగా

పరిశుభ్రతపై అవగాహన

కడియం: స్థానిక శాఖాగ్రంథాలయంలో శుక్ర వారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు ఆశ కార్యకర్తలు అమరావతి కుసుమ, భవాని పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ముందుగా వందేమాతర గీతం ఆలపించి గ్రంథాలయంలోని పుస్తకాలను చదివించారు. పేవరుమిల్లు ఉద్యోగి భాస్కరరావు, రిసోర్స్ పర్సన్ దుర్గయ్య కథలు చెప్పారు. రామాయణంపై క్విజ్ పోటీ నిర్వహించి 10 రౌండ్‌లలో విజేతలకు బహుమతులు అందించారు. గ్రంథాలయాధికారి శ్రీదేవి నిర్మల పాల్గొన్నారు.

యంత్ర పరికరాలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఏఓ ద్వారకాదేవి

కడియం: కస్టమ్ హైరింగ్ సెంటర్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న యంత్ర పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఈలి గోపాలరావు అన్నారు. స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి, ఉద్యానశాఖాధికారి డి.సుధీర్ కుమార్ అధ్యక్షతన వ్యవసాయ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న చిన్న ట్రాక్టర్, పెద్ద ట్రాక్టర్, వరికోత యంత్రాలను గ్రామ, మండల స్థాయిలో రైతులు ఎకరానికి, గంటకు ఎంత రేటుకు తీసుకోవాలనే విషయంపై వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు తీర్మానం చేశారు. ఖరీఫ్‌కు సంబంధించి వరి పండించే రైతులకు కావాల్సిన ఎరువులను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను గుర్తించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

రాజమహేంద్రవరం రూరల్: తరగతిలో పిల్లల నైపుణ్యాలను గుర్తిస్తూ, వాటిని అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. సత్యసాయి నేషనల్ కౌన్సిల్ ఫర్ స్కూల్స్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని సత్యసాయి గురుకులంలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గురుకులం కరస్పాండెంట్ ఏ.శ్యాంసుందర్, ప్రిన్సిపాల్ కె.గుర్రయ్య మాట్లాడుతూ సత్యసాయి సేవా సంస్థలు జాతీయస్థాయిలో ఉపాధ్యాయుల సామర్థ్యానికి పదును పెట్టేందుకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో గురుకులం కమిటీ సభ్యులు సోమసుందర్, రిసోర్స్ పర్సన్లు పద్మశ్రీ, సుజాత పాల్గొన్నారు.

రాజగోపురానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న పందిళ్ల భానుప్రసాద్

ధవళేశ్వరం: అగస్త్యేశ్వరస్వామి ఆలయం వద్ద రాజగోపురం నిర్మాణానికి వైఎస్సార్ సీపీ నాయకుడు పందిళ్ల భానుప్రసాద్ రూ.లక్ష విరాళం సమర్పించారు. గ్రామ పెద్దలకు ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ తోరాటి ప్రభాకరరావు, పిన్నింటి ఏకబాబు, ఆళ్ల ఆనందరావు, వడ్లమూడి కుమార్, డాక్టర్ లక్ష్మణరావు, అడపా శ్రీను, కొత్యాల సుబ్బారాయుడు పాల్గొన్నారు.

బంగారు కొండ పథకానికి దాతల సాయం

కడియం: పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న చిన్నారుల ఆరోగ్యం కోసం కలెక్టర్ మాధవీలత ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన బంగారు కొండ పథకానికి దాతల ద్వారా మంచి స్పందన లభిస్తోంది. దీని ద్వారా ఏడు నెలల నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి, పోషకాహార లోపంతో బరువు తక్కువగా ఉన్న వారికి మంచి మందులతో పాటు పోషకాహారం అందిస్తారు. ఇందుకోసం దాతలు ఒక్కో బాలుడు లేదా బాలిక పౌష్టికాహారం కోసం రూ.మూడువేలు అందించాలి. కాగా.. ఈ పథకానికి దుళ్లలో ఐదుగురు దాతలు ముందుకు వచ్చారు. గ్రామ సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్, వార్డు సభ్యుడు నామాల సుధాకర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు తాతపూడి పార్వతీ బాబీ, మదర్ థెరిసా సేవా సంస్థ సభ్యుడు చందన సత్తిబాబు రూ.మూడు వేలు చొప్పున ఆర్థికసాయం అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. వారిని డీఈఓ అబ్రహం, ఎంపీడీఓ రత్నకుమారి, ఎంఈవో లజపతిరాయ్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మావతి అభినందించారు.

స్వగృహానందం

- జగనన్న కాలనీల్లో చురుగ్గా నిర్మాణాలు
- ఊళ్లుగా మారుతున్న కాలనీలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



వెలుగుబంద జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో సంక్షేమ శకం ప్రారంభమైంది. ప్రతి పేదవానికి లబ్ధి చేకూరాలనే లక్ష్యంతో పాలన సాగుతోంది. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. ముఖ్యంగా పేదల సొంతింటి కలను సాకారం చేశారు. వారికి ఇళ్ల స్థలాలు కేటాయించి, రుణాలు మంజూరు చేసి ఇళ్లు కట్టుకునేందుకు సాయం చేశారు. జగనన్న కాలనీల్లో అన్ని వసతులు కల్పించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు.

వివరాలు ఇవీ..

మొత్తం ఇళ్ల స్థలాలు	6,156
నిర్మాణదశలో ఉన్న గృహాలు	2,231
పునాది దశలో ఉన్నవి	1,767
శ్లాబులు పూర్తయినవి	108
పూర్తయిన ఇళ్లు	410

వెలుగుబందలో లేఅవుట్

రాజమహేంద్రవరం నగరంలో 6,156 మంది పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు రాజానగరం నియోజకవర్గంలోని వెలుగుబందలో 286.5 ఎకరాల్లో జగనన్న కాలనీ పేరిట లేఅవుట్ ఏర్పాటు చేశారు. సొంతంగా గృహ నిర్మాణం చేసుకోవాలని ప్రభుత్వ సహాయంగా రూ.180,000 అందించే కార్యక్రమం చేపట్టారు. లబ్ధిదారులు ప్రభుత్వ అధికారుల సూచనల మేరకు ఇంటి నిర్మాణం చేపట్టారు. సుమారు 30 మంది వరకూ గృహ ప్రవేశాలు చేశారు. తెలుగుదేశం పాలనలో ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా ఏమాత్రం ప్రయోజనం లేకుండా పోయిందని, జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత ఇచ్చిన మాట ప్రకారం స్థలాలు కేటాయించడంతో పాటు అన్ని సదుపాయాలు కల్పించి, ఇళ్ల నిర్మాణం చేసేందుకు దారి చూపించారని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని వసతులు

వెలుగుబంద కాలనీలో విద్యుత్ సౌకర్యం, నీటి సరఫరా, రోడ్లు, ఆర్‌ఓ ప్లాంట్ ఇత్యాది సౌకర్యాలు కల్పించారు. ఏళ్ల తరబడి ఎదురు చూసిన ఇళ్ల నిర్మాణం నిజం కావడంతో లబ్ధిదారుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఇప్పటి వరకూ సాగుతున్న గృహనిర్మాణాల తీరుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ఏడాది చివరి నాటికి నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు గృహనిర్మాణశాఖ అధికారులు చెబుతున్నారు.

కల నెరవేరింది





శుభలక్ష్మి కట్టుకున్న ఇల్లు

టీడీపీ పాలనలో ఎన్నిసార్లు ఇంటి కోసం దరఖాస్తు చేశానో తెలియదు. జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. దాదాపు 20 ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురు చూస్తున్నాం. జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మాకు ఇంటి స్థలం కేటాయించారు. ప్రభుత్వ సాయంతో గృహ నిర్మాణం మొదలు పెట్టాం. ఎటువంటి ఆటంకాలు లేకుండా ఇల్లు పూర్తి చేసుకుని, గృహప్రవేశం చేశాం. నాకు జీవితంలో తీరదు అనుకున్న సొంతింటి కల సీఎం జగన్‌తో సాకారమైంది. ఆయనకు ఎప్పుడూ రుణపడి ఉంటాం.

– సత్తి వెంకట శుభలక్ష్మి, రాజమహేంద్రవరం, 46వ డివిజన్

జగన్ దయతో ఇల్లు వచ్చింది





నాగమణి నిర్మించుకున్న ఇల్లు

జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే మాకు స్థలం కేటాయించారు. జగనన్న కాలనీ మొదలు పెట్టిన తరువాత రెండో ఇల్లు మేమే కట్టుకున్నాం. మాకు ముగ్గురు పిల్లలు అని రాజమహేంద్రవరంలో క్వారీ సెంటర్‌లో ఎవరూ ఇల్లు అద్దెకు ఇచ్చేవారు కాదు. నరక యాతన అనుభవించే వాళ్లం. టీడీపీ అధికారంలో ఉండగా ఎన్నిసార్లు అడిగినా కనికరం లేకుండా పోయింది. జగనన్న పాలన చేపట్టిన తరువాత వలంటీర్లు వచ్చి ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేయమన్నారు. స్థలం ఇచ్చిన వెంటనే ఇల్లు కట్టుకున్నాం.

– కప్పల నాగమణి, 48వ డివిజన్, క్వారీ సెంటర్

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ

కంబాలచెరువు: ఇండక్షన్ శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న మెలకువలు, నైపుణ్యాలను తరగతి గదిలో అమలు చేయాలని జిల్లా విద్యాశిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌డీవీ. రమణ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నాలుగు విడతలుగా జరిగిన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. జిల్లా శిక్షణ సంస్థ ద్వారా నిర్వహించబడిన ఈ కార్యక్రమాల్లో మొత్తం 1,100 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చామన్నారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ శిక్షణకు ప్రాంతీయ సహాయ సంచాలకులు పాఠశాల విద్య కాకినాడ జి.నాగమణి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం, విశ్రాంత జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డి.గోపాలకృష్ణ హాజరై తగు సూచనలు చేశారన్నారు.

బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరం ముగింపు

ప్రకాశం నగర్: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, సిటీ బాస్కెట్ బాల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 40 రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ముగింపు సభలో కళాశాల ప్రిన్సిపాల్ రాజబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో దొండంపాటి సత్యంబాబు, జిల్లా చీఫ్ కోచ్ డీఎంఎం శేషగిరి పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులుంటే తెలియజేయండి

- వాటర్ రెస్పాన్స్ టీం ఏర్పాటు
- ఎంపీ భరత్‌రామ్



మార్గాని భరత్‌రామ్, ఎంపీ

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని ఏ డివిజన్‌లోనూ తాగునీటి సమస్య ఉత్పన్నం కాకూడదని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఒకవేళ ఎక్కడైనా సమస్య తలెత్తితే తన దృష్టికి తీసుకు రావాలని ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన రాజమహేంద్రవరం నగర వైఎస్సార్ సీపీ నాయకులు, వార్డు ఇన్‌చార్జులు, జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ఏ డివిజన్‌లో అయినా లోప్రెషర్‌తో నీరు సరఫరా రాకపోతే వెంటనే తన కార్యాలయానికి ఫోన్ చేసి సమాచారం అందిస్తే తక్షణ చర్యలు తీసుకుంటామని ఎంపీ భరత్ తెలిపారు. ఇందుకోసం వాటర్ రెస్పాన్స్ టీం (98667 35454) ఏర్పాటు చేశామన్నారు. రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎంపీ నిధులు రూ.1.45 కోట్లతో 15 మొబైల్ వాటర్ ట్యాంకర్లు కొనుగోలు చేసి అందజేసినట్టు తెలిపారు. అలాగే వేసవి నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గోవా కాన్ఫరెన్స్‌కు ఎల్ఐసీ ఉద్యోగులు



గోవాకు బయలుదేరుతున్న ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్: గోవాలో శని, ఆదివారాల్లో జరిగే ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల 15వ జనరల్ బాడీ మీటింగ్‌కు ఎల్ఐసీ రాజమండ్రి డివిజన్ ఎస్సీ, ఎస్టీ నాయకులు శుక్రవారం బయలుదేరి వెళ్లారు. కాన్ఫరెన్స్‌కు ముఖ్యఅతిథిగా ఎస్సీ, ఎస్టీ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ డాక్టర్ కీర్తి సోలంకి విచ్చేస్తారు. ఎల్ఐసీని కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నూతనంగా ఉద్యోగాల భర్తీ, దేశంలో ప్రజలందరికీ బీమా చేయించడం తదితర అంశాలపై చర్చిస్తారు. ఈ కార్యక్రమంలోని దేశంలోని 8 జోన్లు, 108 డివిజన్ ఆఫీసులు, 2,048 బ్రాంచ్‌ల నుంచి 5,000 మంది అసోసియేషన్ సభ్యులు పాల్గొంటారని రాజమండ్రి డివిజన్ ప్రధాన కార్యదర్శి సమతం గన్నయ్య తెలిపారు. తాళ్లూరు బాబూ రాజేంద్రప్రసాద్, జే.వెంకటేశ్వరరావు, డి. వీరకిషోర్, పులిదిండి ఆనంద కుమార్, సీహెచ్ భాస్కర్, పి.అరవింద్, జి.రాధాకృష్ణ తదితరులు బయలుదేరారు.

ఘనంగా వినాయక ఆలయ వార్షికోత్సవం



అన్నసమారాధనలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీ డైమండ్ పార్కులోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం ఆలయ ధర్మకర్త కోనాటి వెంకట రమణ, లలిత దంపతులు, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి పంచామృతాభిషేకాలు, హోమం, మహాపూర్ణాహుతి శాస్త్రోక్తంగా జరిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్ చందన నాగేశ్వర్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధనను ప్రారంభించారు. మాజీ ఉప సర్పంచ్ బొమ్ము శ్రీను, మాజీ ఎంపీటీసీ కాకరపల్లి అప్పారావు, పార్టీ నాయకులు పుచ్చా గోవిందర్ రెడ్డి, ప్రసన్నకుమార్ రెడ్డి, మీగడ గంగాధర్, కాకుర్తి మురళి, గాదె అనురాధ, పగడాల లక్ష్మణరావు, రుంకాని రవికుమార్, దత్తసాయి పాల్గొన్నారు.

నర్సరీల సందర్శన

కడియం: ముంబై నార్త్ ఈస్ట్ పార్లమెంటు సభ్యుడు మనోజ్ కోటక్‌జీ శుక్రవారం కడియం నర్సరీలను సందర్శించారు. బోరుసు సుబ్రహ్మణ్యం ధనలక్ష్మి నర్సరీ, కోటికలపుడి వెంకటేశ్వరరావు మాణిక్యాంబ నర్సరీ, పల్ల వెంకన్న సత్యనారాయణ నర్సరీ గార్డెన్‌ను సందర్శించి వివిధ రకాల మొక్కల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నర్సరీల విశిష్టతను ప్రధానమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. పల్ల వెంకన్న నర్సరీ అధినేతలు పల్ల సుబ్రమణ్యం, సత్తిబాబు, వెంకటేష్ ఆయనను సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్ర మహిళా మోర్చా మాజీ అధ్యక్షురాలు మాలతీ దేవి, బీజేపీ మండల అధ్యక్షుడు నాగులపల్లి వీరబాబు, రాష్ట్ర సీనియర్ నాయకులు పెనుమాక శేషగిరి, పాటంశెట్టి సూరిబాబు పాల్గొన్నారు.

విద్యాశాఖ కేలండర్‌లో 'నాగరాజా' కృత్యాలు

కంబాలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 2023 – 24 విద్యాసంవత్సరం అకడమిక్ కేలండర్‌లో నాగరాజ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గత సంవత్సరం చేపట్టిన కృత్యాల ఫొటోలను ముద్రించారు. ఈ మేరకు ఆ వివరాలను ఆ స్కూలు ప్రధానోపాధ్యాయిని మంగారాణి శుక్రవారం తెలిపారు. ఇది పాఠశాలకు దక్కిన గౌరవమని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ అన్నారు. గత సంవత్సరం మంగారాణి నేతృత్వంలో ఉపాధ్యాయులు కలిసి చేసిన నోబ్యాగ్‌డే కృత్యాలు, ముఖ్యంగా తరగతి లైబ్రరీ, పప్పెట్రీ చిత్రాలను ప్రాథమిక అకడమిక్ కేలండర్ లో ముద్రించారు. ఈ విద్యాసంవత్సరం ఈ కేలండర్‌ను ప్రధానోపాధ్యాయులు అందరూ డౌన్‌లోడ్ చేసుకుని జూన్ 12 నుంచే అన్ని కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

పథకాల అమలులో వలంటీర్లు కీలకం

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- వలంటీర్లకు పురస్కారాల ప్రదానం



వీరభద్రనగర్‌లో వలంటీర్లను సత్కరిస్తున్న చందన నాగేశ్వర్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో వలంటీర్లు కీలకమని, వారు మరింత బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని 16వ డివిజన్ బాలాజీపేట, వీరభద్రనగర్‌లో 29, 39, 40, 41 వార్డు సచివాలయ పరిధిలోని 86 మంది వలంటీర్లకు శుక్రవారం ఆయన సేవామిత్ర పురస్కారాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్లదే ప్రధాన పాత్ర అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకు అందిస్తున్న వలంటీర్ల సేవలను అభినందించారు. కార్యక్రమంలో మాజీ రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ చైర్మన్ పాలిక శ్రీను, వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు నాగేంద్ర, గోపి, ప్రకాష్, జయలక్ష్మి, సూర్యకళ, ప్రసాద్, త్రిమూర్తులు, ఉమా, చిందాడ అనురాధ, పార్టీ నాయకులు పెయ్యల రాజేష్, గృహసారథులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మెప్మా బజార్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో నగరపాలకసంస్థ మెప్మా విభాగం ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో స్థానిక పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్ (బజార్) నగర ప్రజలకు విశేషంగా ఆకట్టుకుందని మెప్మా డీఆర్పీ లలిత అన్నారు. మహిళా సంఘాలు తయారు చేసిన దుస్తులు, స్త్రీల అలంకరణ వస్తువులు, జూట్ బ్యాగులు, కొయ్య బొమ్మలు, ఆయుర్వేదిక్ ఉత్పత్తులు, రాగి పిండితో తయారుచేసిన టీ కప్పులు, వైర్ బ్యాగులు, పచ్చళ్లు తదతర వాటిని ఏర్పాటు చేశామన్నారు.

యువకుడి అదృశ్యం



పెమ్మాడ ధర్మ (ఫైల్)

ధవళేశ్వరం: గ్రామంలోని వాడపేటకు చెందిన పెమ్మాడ ధర్మ అనే యువకుడు అదృశ్యమయ్యాడు. అతడికి మూడేళ్ల క్రితం వివాహమైంది. గురువారం భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో సాయంత్రం ఇంట్లో సెల్‌ఫోన్ వదిలి ధర్మ బయటకు వెళ్లిపోయాడు. అతడి కోసం అన్నిచోట్లా గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో భార్య సంధ్యారాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ కె.మంగాదేవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యూనియన్ బ్యాంకు సేవలు మరింత విస్తృతం

- జీఎం ప్రమోద్‌కుమార్ రెడ్డి
- నర్సరీ రైతులకు అవగాహన సదస్సు



యూనియన్ బ్యాంకు జీఎం ప్రమోద్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నర్సరీ రైతులు

కడియం: మహిళల ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యమిస్తూ యూనియన్ బ్యాంకు సేవలను విస్తృతం చేసిందని ఆ బ్యాంకు జనరల్ మేనేజర్ ప్రమోద్‌కుమార్ రెడ్డి తెలిపారు. కడియపులంక నర్సరీ అసోసియేషన్ భవనంలో యూనియన్ బ్యాంకు రీజనల్ బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం నర్సరీ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా పరమహంస యోగానంద నేత్రాలయ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కంటి వైద్యశిబిరాన్ని డీజీఎం కృష్ణయ్యతో కలిసి ప్రమోద్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న దేశాల వరసలో భారతదేశం ఐదోస్థానంలో నిలిచిందన్నారు. భారత్‌లో 70 శాతం పైబడి వ్యవసాయ ఆధారితంగా కార్యకలాపాలు సాగుతున్నాయన్నారు. నర్సరీ రంగానికి ప్రాముఖ్యతను పెంచి తదనుగుణంగా అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశాలను పరిగణించి రైతులకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. పలు శాఖల మేనేజర్లతో కలిసి ఇటీవల మంజూరైన రుణపత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నర్సరీ రైతు మార్గాని సత్యనారాయణ మాట్లాడుతూ నర్సరీ రంగాన్ని ఇతర రంగాలతో పోల్చకుండా ప్రత్యేకత ఇవ్వాలన్నారు. మంజూరు చేస్తున్న రుణాలకు సంబంధించి రాయితీపై వడ్డీని తగ్గించాలని ప్రతిపాదించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ మాట్లాడుతూ ఆంధ్రాబ్యాంకు ప్రైవేటీకరణ అనంతరం మేనేజర్లకు స్వేచ్ఛ హరించిందని, చిన్నతరహా పనులకు కాలయాపన అనివార్యంగా మారిందన్నారు. అనంతరం నర్సరీ రైతులకు అందించే రుణాలు రెన్యూవల్ చార్జీల వాల్యుయేషన్ తదితర భారాన్ని తొలగించాలని కోరుతూ జీఎం ప్రమోద్‌కుమార్‌రెడ్డికి నర్సరీ అసోసియేషన్ తరఫున వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కడియం శాఖ బ్రాంచి మేనేజర్ శ్రీనివాసరెడ్డి, పుల్లా ఆంజనేయులు, సింగంశెట్టి శ్రీను, గంగుమళ్ల సత్యనారాయణ, తిరుమలశెట్టి శ్రీను, బొరుసు సుబ్బారాయుడు, పుల్లా రామకృష్ణ, పెద్ద సత్యనారాయణ, వారా రాము, తాళం నరేష్ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



శశ్రూషను అభినందిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ ఆకాంక్షించారు. నన్నయ నగరపాలక హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న పి.శశ్రూష హర్యానాలోని రోహతక్‌లో జరిగిన 5వ ఆల్ ఇండియా నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ 2023లో అండర్ 14 విభాగంలో మొదటి బహుమతి గెలుచుకుంది. ఈ సందర్భంగా బాలికను కమిషనర్ అభినందించారు. నగరపాలక సంస్థ పాఠశాలల్లో ఎందరో విద్యార్థులు క్రీడలల్లో ఆసక్తి చూపుతున్నారని, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు శ్రద్ధ తీసుకుని వారిని క్రీడలలో పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. కాగా.. శశ్రూష తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కుమార్తె రోహతక్ వెళ్లడానికి కమిషనర్ ఆర్థిక సాయం చేశారన్నారు.

సమర్థంగా వ్యర్థాల నిర్వహణ

స్వచ్ఛ సర్వేక్షన్ 2023లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు వేస్ట్ ప్రాసెసింగ్ కీలకమని నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ అన్నారు. నగరంలోని తడి, పొడి, హానికారక చెత్త ప్రాసెసింగ్ ప్లాంట్లను సిబ్బందితో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. యార్డులోని తడిచెత్త విండ్రో ప్లాట్‌ఫాం షెడ్‌ను పరిశీలించి, వర్షాకాలంలో కుప్పలు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ వెహికల్ యార్డ్ వద్ద నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం నిధులతో ఏర్పాటు చేసిన బిల్డింగ్ వ్యర్థాల క్రషర్ మెషీన్‌ను పరిశీలించారు. సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ సందర్శించి లిక్విడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సంబంధించిన లాగ్‌బుక్స్, ల్యాబ్‌ను తనిఖీ చేశారు. ఆయన వెంట అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గిరిధర్ పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు

బిక్కవోలు: అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.బుజ్జిబాబు శుక్రవారం తెలిపారు. రంగాపురం గ్రామానికి చెందిన గండికోట దుర్గమ్మ కుమార్తె నక్కా ఇంద్రాక్షికి అదే గ్రామానికి చెందిన నక్కా దుర్గయ్యతో ఏడాది కిందట వివాహం అయ్యింది. అప్పుడు కట్నంగా రూ.3 లక్షలు ఇచ్చినట్లు, తిరిగి అదనపు కట్నం కావాలని తన కూతురిని అల్లుడు వేధిస్తున్నాడని దుర్గమ్మ ఫిర్యాదు చేసింది. ఏడో నెల గర్భిణి అని కూడా చూడకుండా ఇంద్రాక్షిని కొట్టడంతో అనపర్తి సీహెచ్‌సీకి తీసుకువెళ్లామంది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- నరేంద్రపురంలో గడపగడపకూ మన ప్రభుత్వం



నరేంద్రపురంలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ప్రధాన లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని నరేంద్రపురంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకి పార్టీలకు అతీతంగా ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగ క్షేమాలు తెలుసుకుంటూ గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, ఎదురైన సమస్యలను ఆరాతీశారు. గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్‌క్లినిక్‌లు, గ్రామ వలంటీర్ల పనితీరు ఏవిధంగా ఉందంటూ ప్రజల అభిప్రాయాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. గతంలో ఏ అవసరం వచ్చినా ఎటువంటి ఇబ్బందులు ఎదురయ్యేవో ఒకసారి గుర్తు చేసుకోవాలని, గత నాలుగేళ్ల పాలన ఏవిధంగా ఉందో మననం చేసుకుని రాబోయే ఎన్నికలలో జగనన్న ప్రభుత్వానికి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. గ్రామంలో గడచిన నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ, గతానికి ఇప్పటికీ ఉన్న వ్యత్యాసాన్ని మీరే గ్రహించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో ఇప్పటికే 98.4 శాతం హామీలను నెరవేర్చిన ప్రభుత్వం తమదేనని సగర్వంగా చెప్పగలుగుతున్నామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, ఆసరా, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక, వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు తంగెళ్ల చిలకమ్మ, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, కో కన్వీనర్ గండి నానిబాబు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న పాల్గొన్నారు.